క్లుప్తంగా

ఓపీ సేవలు బహిష్కరణ

దొనకొండ: పీజీ వైద్య సేవలు ఇన్ సర్వీస్ కోటాను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం నుంచి ప్రాథమిక వైద్యశాలలో వైద్యులు ఓపీ సేవలు బహిష్కరించారు. అత్యవసర సేవలు మాత్రమే మినహాయింపు ఇస్తామని పీహెచ్‌సీ వైద్యుల సంఘం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని, ఆదివారం ఛలో విజయవాడ, సోమవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి భారీ ర్యాలీ చేపడతామని మంగళవారం నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తామని దొనకొండ వైద్యులు యం.సునీత తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


అర్ధవీడులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు

బేస్తవారిపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ కార్యకర్తలు వై. తిరుపతమ్మ, టీవీ సుబ్బమ్మ, సయ్యద్ జిలానిభాను అన్నారు. శనివారం అర్ధవీడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. తాజా ఆకుకూరలు, కూరగాయాలు, ఎండు ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష తీసుకోవడంతో రక్తహీనతను నివారించవచ్చునని తెలిపారు. బాల్యవివాహాలతో ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన పౌష్టికాహార వంటలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు, ఆయాలు పాల్గొన్నారు.

ఏకీకరణ హర్షణీయం


మిఠాయిలు పంచుకుంటున్న ఎక్సైజ్ అధికారులు

దర్శి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అబ్కారీ శాఖను ఏకీకరణ చేయడం హర్షణీయమని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. సుందరరామయ్య అన్నారు. శనివారం కార్యాలయంలో మిఠాయిలు పంచుకున్నారు. సుందరరామయ్య మాట్లాడుతూ స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరోను రద్దు చేసి ఉద్యోగులందరినీ అబ్కారీ శాఖలో విలీనం చేయడం ఆనందదాయకమని చెప్పారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఇ. కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

చౌదరి మరణం తీరని లోటు


భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: పీవీఆర్ చౌదరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం. రమేష్ బాబు అన్నారు. పీవీఆర్ చౌదరి భౌతిక కాయానికి దర్శి సీపీఐ నాయకులు ఒంగోలులో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నాయకునిగా, జిల్లా అధ్యక్షునిగా కార్మిక ఉద్యమాన్ని నడిపించిన చౌదరి లేరని వార్త కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి, జూపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అవును.. మా వాళ్లు అవినీతి పరులే!

యర్రగొండపాలెం: ఇప్పటి వరకు ప్రతిపక్షాలు చేసేది కేవలం ఆరోపణలే అని ఆ పార్టీ పెద్దలు గగ్గోలు పెడుతుంటే.. కాదు, టీడీపీ వారి అక్రమాలు నిజమే అని ఆ పార్టీవారే ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో విచ్చలవిడిగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాపై టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నలగాటి మల్లికార్జున నాయుడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందించడం గమనార్హం. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కులు పక్కదోవ పట్టిస్తున్నారని, వారి భరతం పట్టి రేషన్ అక్రమ రవాణాకు బ్రేకులు వేయాలని కోరినట్లు ఆయన శనివారం తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, అక్రమ రవాణా నివారిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

పోటీలు విజయవంతం చేయండి

ముండ్లమూరు(దర్శి): మండలంలోని ఉమామహేశ్వరపురం, ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న ఆటల పోటీలను విజయవంతం చేయాలని ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ జి. భవన్నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు ఈ నెల 19న అథ్లెటిక్స్ విభాగంతో పాటు బాడ్మింటన్, చెస్, యోగా ముండ్లమూరు హైస్కూల్లో జరుగుతాయన్నారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ ఆటలు ఉమామహేశ్వరపురం హైస్కూల్లో ఈ నెల 20న నిర్వహిస్తామన్నారు.

- అంగన్‌వాడీలకు అరకొర సరుకులు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందని పౌష్టికాహారం
- కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- కందిపప్పు, నూనెకు కత్తెర

పేదలపై పగ


అన్నం తినకుండా దిక్కులు చూస్తున్న చిన్నారులు


చిన్నారులకు అన్నం పెడుతున్న ఆయా

కురిచేడు:

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అరకొరగా సరుకులు అందుతున్నాయి. సక్రమంగా సరఫరా చేయాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో అంగన్‌వాడీ లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి. పౌష్టికాహార లోపాన్ని నివారించటంతో పాటు, శిశు మరణాల నివారణలో అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయి. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం నిరుపేదల్లోని గర్భిణులు, తల్లులు, చిన్నారులకు ఎంతో ఉపయోగ పడేది. ఈ నేపథ్యంలో వాటిని ఇంకా బలోపేతం చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

నేడు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేటి వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు అందలేదు. నూనె కూడా సరఫరా చేయకపోవటంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. జూన్ నుంచి ఈ దుస్థితి నెలకొంది. మండలంలో 47 అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో సరఫరా అయిన మేరకు మాత్రమే అందిస్తున్నారు. పప్పులో ఎక్కువ ప్రోటీన్లు, నూనెలో కొవ్వు పదార్థాలు అందుతాయి. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు కొవ్వు పదార్థాలు, ప్రోటీన్ల అవసరం ఎక్కువగా ఉంటుంది. ప్రతి నెలకు సంబంధించిన సరుకులు, ముందు నెల చివర్లోనే అందించాల్సి ఉంటుంది. కానీ జూన్ నెల నుంచి అరకొరగా అందిస్తున్నారు. ఈ విషయాన్ని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు ఐసీడీఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా సరుకుల సరఫరా వ్యవహారం రాష్ట్ర స్థాయిలో జరుగుతుండటంతో వారు కూడా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో మిన్నకుండిపోయారు.

గాడి తప్పుతున్న నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార పంపిణీలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా ఒక్కొక్కరికి మూడు కిలోల బియ్యం, ఒక కేజీ కంది పప్పు, అర కేజీ నూనె, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగి పిండి, అరకిలో చిక్కీ చెక్క, అర కిలో బెల్లం, ఒక కిలో అటుకులు పంపిణీ చేస్తారు. ప్రతి కేంద్రంలో నమోదైన గర్భిణులు, బాలింతలు, పిల్లల సంఖ్య మేరకు ప్రతి నెలా ఆఖరి వారంలో తదుపరి నెలకు సంబంధించిన సరుకులు సరఫరా చేస్తారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సరుకులు సకాలంలో సరఫరా కావడం లేదు. కోడిగుడ్లు సైతం చిన్న సైజువి ఇస్తున్నారు.

> **ప్రభుత్వ సరఫరా మేరకు అందజేస్తున్నాం**
>
> ప్రభుత్వం సరఫరా చేసిన సరుకులు బాలింతలు, గర్భిణులకు అందజేస్తున్నాం. చిన్నారులకు మెరుగ్గానే భోజనం పెడుతున్నాం. వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారం అందజేస్తున్నాం.
>
> నాగమణి, సూపర్‌వైజర్

రాజీయే రాజమార్గం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శంకర రెడ్డి

దర్శి: రాజీయే రాజమార్గమని, వివాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం వృథా చేసుకోవద్దని సీనియర్ సివిల్‌జడ్జి ఎస్. శంకర రెడ్డి పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ న్యాయమూర్తి శివశంకరరెడ్డి మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 35 కేసులను రాజీచేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో ఒకసారి రాజీ చేసుకుంటే ఆ కేసుల్లో పై కోర్టులకు వెళ్లే అవకాశం కూడా ఉండదన్నారు. కక్షిదారులంతా ఆలోచించి రాజీ మార్గం పెంచుకోవాలని సూచించారు. ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. రేణుక, దర్శి జూనియర్ సివిల్ జడ్జి కె. నికిత, న్యాయవాదులు బి. చెన్నకేశవులు, ఆదినారాయణ, రవి పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం


పసుపుగల్లులో వైఎస్సార్ సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన విగ్రహం

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా నిర్వహించారు. వేంపాడు, పెదరావిపాడులో ఎనిమిదో రోజు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పసుపుగల్లులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బూచేపల్లి అభిమానులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు.

గంగమ్మ చెంతకు గణపయ్య

కురిచేడు: మండలంలోని పడమర గంగవరం గ్రామంలో బూచేపల్లి శివన్న, చెవిరెడ్డి భాస్కరరెడ్డి యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమం శనివారం శ్రీశైలంలో జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని విగ్రహాన్ని ఉంచి డీజే పాటల మధ్య గ్రామస్తులు గులాములు చల్లుకుంటూ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీశైలం వెళ్లి స్వామివారి నిమజ్జన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. యువకులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శ్రీశైలంలో నిమజ్జనం నిర్వహిస్తున్న ప్రజలు

కోటా రామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


కోటా రామిరెడ్డి (ఫైల్)

తాళ్లూరు (దర్శి): మాజీ ఎంపీపీ కోటా రామిరెడ్డి (54) మరణం వైఎస్సార్ సీపీకి తీరని లోటని మండలంలోని పలువును నాయకులు తెలిపారు. తాళ్లూరుకు చెందిన కోటా రామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. కోటా రామిరెడ్డి చిన్నతనంలోనే రాజకీయ రంగ ప్రవేశం చేశారు. మొదట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పని చేశారు. 2002 నుంచి వైస్ ఎంపీపీగా పని చేస్తూ 2006లో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. పార్టీని బలోపేతం చేయడంలో ముఖ్య నాయకులు వైవీ సుబ్బారెడ్డి, భద్రారెడ్డి, బూచేపల్లి శివప్రసాదరెడ్డిలకు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. రామిరెడ్డికి భార్య, ఇరువురు కుమార్తెలున్నారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన రెడ్డి, గోళ్లపాటి మోషే, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, తాళ్లూరు మాజీ సర్పంచ్ ఐ. పెద్దిరెడ్డి, సర్పంచ్‌లు ఎస్‌కే వలి, పోశం శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఐవీరెడ్డి, పులి ప్రసాదరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులున్నారు.

పూరిల్లు దగ్ధం


గుండంచర్లలో కాలిపోయిన పూరిల్లును చూపిస్తున్న బాధితుడు యర్రయ్య

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం చెంచుగుడెంలో మండ్లా యర్రయ్య పూరిల్లు శనివారం సాయంత్రం దగ్ధమైంది. ఇంటిలో నుంచి మంటలు రావడంతో చుట్టు పక్కల వారు బిందెలతో నీరు చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు చల్లార్చేటప్పుడు ఇంటిలో గ్యాస్ సిలిండర్ ఉందనే భయంతో ఆందోళన చెందారు. కానీ గ్యాస్ సిలిండర్ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. యర్రయ్య ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇంటిలో ఉన్న మోటార్ సైకిల్, టీవీ, బట్టలు, తిండి గింజలు కాలిపోయాయి. కట్టు బట్టలతో ఉన్నామని దాదాపు రూ. 1.50 లక్షలు నష్టం జరిగిందని బాధితుడు యర్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

పోషకాహార లోపంతో ఆరోగ్య సమస్యలు


గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


పౌష్టికాహార ప్రదర్శనలో కార్యకర్తలు

దొనకొండ: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే శ్రేష్టమని, అలా పోషకాహారం తీసుకోకుండా ఉన్న వారికి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ, బేతేలుపురం సెంటర్‌లో శనివారం పోషకాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు హాజరై వారికి కావాల్సిన పోషకాహార విలువల గురించి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించి చిన్నారుల బరువు, ఎత్తు నమోదు చేశారు. ఝాన్సీరాణి, మేరి, ఆశ నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

పెద్దారవీడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. గొబ్బూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పాలు, గుడ్లు, చిక్కీలు.. ఆకుకూరలతో ఆహారం తీసుకుంటే తల్లులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యకర్తలు అన్నపూర్ణ, హైమావతి, రంగలక్ష్మి, ఆదిలక్ష్మి, ఏఎన్ఎం నారాయణమ్మ, ఆశ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

డ్రిప్ అక్రమ మంజూరుపై ఫిర్యాదు

కొనకనమిట్ల: తన పొలంలో బోరు లేకుండా, పంట సాగు చేయకుండానే అధికారులు డ్రిప్ పైపులు మంజూరు చేయడంపై మండలంలోని చింతగుంట గ్రామ మాజీ సర్పంచ్ రాగి గురవయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు శనివారం తెలిపారు. వివరాలు.. చింతగుంట గ్రామానికి చెందిన వసంతపురం వెంకటచెన్నయ్యకు ఆరు ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. దీనిలో వర్షాధార పంటలు సాగు చేస్తుంటాడు. అయితే వెంకటచెన్నయ్య తన పొలంలో బోరు ఉన్నట్లు, పంటలు సాగు చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి సంబంధిత అధికారులకు తెలియజేసి అక్రమంగా పూర్తి రాయితీపై డ్రిప్ పైపులు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. బోర్లు లేకుండా పంటలు సాగు చేయకుండా ఏ అర్హతతో వెంకటచెన్నయకు వేల రూపాయలు విలువ చేసే డ్రిప్, పైపులు మంజూరు చేస్తారని మాజీ సర్పంచ్ గురవయ్య ప్రశ్నించారు.

ఏచూరి మృతి తీరని లోటు


త్రిపురాంతకంలో సంతాపం వ్యక్తం చేస్తున్న పార్టీ నాయకులు

దొనకొండ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని మండల సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య తెలిపారు. శనివారం దొనకొండలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంజయ్య మాట్లాడుతూ ఆయన జీవితంలో పార్టీకి చేసిన సేవలుఅంజయ్య కొనియాడారు. అనిల్, సుధాకర్, అంజిబాబు, నాతాను పాల్గొన్నారు.

త్రిపురాంతకం: సీపీఎం నాయకుడు ఏచూరి సీతారాం మృతికి ఆపార్టీ నాయకులు, ఇతర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. త్రిపురాంతకంలో శనివారం నిర్వహించిన సభలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన గొప్ప నాయకుడు ఏచూరి సీతారాం అని పేర్కొన్నారు. రాజారామయ్య, నాగేశ్వరరావు, అంజనేయులు, లాబాను, పిచ్చయ్య, నాగమల్లేశ్వరి, నాంబాబు, చెన్నకేశవులు, గాలిరెడ్డి పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అంజయ్య

పంటలను పరిశీలించిన బృందం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పలు రకాల పంటలతో పాటు పండ్ల తోటలను గుజరాత్‌కు చెందిన పలువురు రైతులు, వ్యవసాయ సిబ్బంది శనివారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో పంటలను పరిశీలించి ఆమె ద్వారా సాగు పద్ధతులు, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా రైతు సుజాత మాట్లాడుతూ తాను 40 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు వివరించారు. 40 ఎకరాల్లో అంతర పంటలుగా కంది, సజ్జ, జొన్న, పెసర సాగు చేశామన్నారు. కూరగాయల పంటలతో పాటు మామిడి, సపోట, ఉసిరి, అరటి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలంతో పాటు శ్రీగంధం, ఎర్రచందనం సాగు చేశానని తెలిపారు. సేంద్రియ ఎరువులతోనే పండిస్తున్నట్లు సుజాత వారికి వెల్లడించారు.